# అమ్మా! నాన్నా!! నన్ను చంపేయండి!!!



కథ

**ఎస్.జయ**

"నాన్నా! నాన్నా!"

** ** **

లే నాన్నా! నీ ప్రీతిని పిలుస్తున్నాను. లే నాన్నా!"

చంద్రశేఖర్ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు. ప్రీతి తనను పిలవడమేమిటీ? కలకంటున్నానా? అనుకున్నాడు చుట్టూ పరికిస్తూ.

బెడ్‌రూంలో తాను, తన భార్య శ్రీవిద్య తప్ప ఎవరు లేరు. శ్రీవిద్య గాఢనిద్రలో వుంది. ఆమెకు ఈ పిలుపులు వినిపించడం లేదా? అనుకున్నాడు. భార్యవైపు తదేకంగా చూశాడు శేఖర్. బ్లూ కలర్ బెడ్ లైట్ వెలుగు ఆ గదిలో వెన్నెల కురుస్తున్నట్లుగా వుంది. పాతికేళ్ల శ్రీవిద్య చాలా ప్రశాంతంగా నిద్రపోతోంది. ఎనిమిది నెలల చూలాలు కావడం వల్ల శ్రీవిద్య ఆ వెలుగులో మరింత అందంగా ఆరోగ్యంగా కనిపించింది.

"ఎవరూ లేరే, తను కల కన్నాడు అంతే" అనుకున్నాడు శేఖర్.

శ్రీవిద్య నడుం మీద చేయి వేసి నిద్రపోవడానికి ప్రయత్నించాడు.

"నాన్నా! నీవు కలగనడంలేదు. నీ ప్రీతిని మాట్లాడుతున్నాను నాన్నా!"

'ఎక్కడ్నుంచా ఆ మాటలు వినిపిస్తోంది' అని పరికించి చూశాడు.

"నాన్నా... అమ్మ పొట్టలోంచి మాట్లాడుతున్నాను నాన్నా!"

అర్జునుడి మాటలు వింటూ సుభద్ర నిద్రపోతే అభిమన్యుడు తల్లి కడుపులో వుండి తండ్రి మాటలు విన్నాడని, అలా పద్మవ్యూహంలోకి వెళ్లడం తెలుసుకున్నాడని కథలు విన్నాడు. కాని తల్లి పొట్టలో వున్న పాపలు మాట్లాడడం వింతగా వుంది. అతనికి నమ్మబుద్ధి కాలేదు. అంతా తన భ్రమ అనుకున్నాడు శేఖర్.

"నాన్నా, నువ్వు భ్రమపడడం లేదు. నిజంగానే నేను మాట్లాడుతున్నాను. నా మాటలు విను నాన్నా!"

పుట్టబోయే పాపాయి తనతో మాట్లాడుతోంది అని భాస్కర్‌కు ఆశ్చర్యంగా, సంతోషంగా ఉంది.

"మీరు చాలా ప్రేమగా నాకు ప్రీతి అని పేరు పెట్టుకోవాలని, నాకు రంగురంగుల ఫ్రాకులు కొని, ఆడించాలని, చాలా చాలా కలలు కంటున్నారు. మీకు పాప పుట్టబోతోందని తెలిసి కొందరు పెదవి విరవడం కూడా విన్నాను. అయినా మీరు నన్ను బాగా చూసుకోవాలని మీరు చెప్పుకొనే కబుర్లు విన్నాను నాన్నా! కాని, నాన్నా! నాకు చచ్చిపోవాలని వుంది నాన్నా! నాకు పుట్టాలని లేదు నాన్నా. నన్ను చంపండి నాన్నా!"

శేఖర్ భయంతో లేచి కూర్చున్నాడు. శ్రీవిద్యను లేపబోయాడు.

"నాన్నా నీకు చెప్పాల్సిన విషయాలు చాలా ఉన్నాయి. నన్ను చెప్పనీయి నాన్నా, అమ్మను లేపొద్దు. ఇప్పుడు నిద్ర పోని. తరువాత ఆమె బాధపడుతూ ఎన్నో రాత్రులు నిద్ర పోకుండా ఉండాల్సి ఉంటుంది."

"మీరు నన్ను ప్రేమగా చూసుకుంటారని నాకు తెలుసు నాన్న. కాని నాన్నా ఈ అసమానతల సమాజం నన్ను ఎన్నో విధాల వేధిస్తుంది. నన్ను చూసి మీరు కూడా బాధపడతారు. ఆడపిల్లను కనడం నేరంగా, తక్కువగా చూస్తోంది. ఆడపిల్లలంటే అబార్షన్లు చేయించుకొని మగపిల్లవాడిని మాత్రమే కనే తల్లిదండ్రులు, మగపిల్లవాడి కోసం ముగ్గురు నలుగురు ఆడపిల్లల్ని కని, ఆడపిల్లలకు మంచి చదువులు కూడా చెప్పించకుండానే చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసి, మగపిల్ల వాడికే అన్ని అవకాశాలు, ఆస్తులు ఇచ్చే తల్లిదండ్రులు గౌరవించబడుతున్నారు. కాని నాన్నా మగపిల్లలు లేని ఆడపిల్లల తల్లిదండ్రులు, ఆడపిల్లలాగే బాధలు పడుతున్నారు. అవమానాలు పొందుతున్నారు. నాన్నా, నన్ను కన్నందుకు మీరు బాధలు పడకూడదు. అందుకే నన్ను చంపేయండి నాన్నా!"

"మా చిన్నారి తల్లి, ప్రీతీ, నిన్ను కంటిపాపలా కాపాడుకుంటాం. నీకా భయం వద్దు. నువ్వు మామధ్యకు రావాలమ్మా" అన్నాడు శేఖర్.

"పక్కింటి దీప్తిని చూశాక నాకు భయమేస్తుంది నాన్నా. అమ్మకు దీప్తి చెప్పిందంతా విన్నాను నాన్నా. కట్నం కానుకలు చాలక దీప్తిని కాపురానికి తీసికెళ్లలేదు అని మాత్రమే నీకు తెలుసు కాని, నీకు దీప్తి గురించి అన్ని వివరాలు అమ్మ చెప్పలేదు. దీప్తి గురించి విన్నాక నా నిర్ణయాన్ని ఒప్పుకుంటావు" అని దీప్తి గురించి చెబుతుంది.

** ** **




దీప్తి తండ్రి గోపాలరావుది కర్నూలు. నలుగురు అన్నదమ్ములు. చివరివాడని చదివించారు. పొలాలు అన్నలు సాగుచేస్తుంటే తాను హైదరాబాద్ వచ్చి ఒక పత్రికాఫీసులో సర్క్యులేషన్ మేనేజర్‌గా చేరాడు. ఆయనకు దీప్తి, ఇందిర ఇద్దరు కూతుళ్లు. ఇద్దరిని ఇంజనీర్స్ చేయాలని అతని కల. దీప్తి ఫైనలియర్ చదువుతున్నప్పుడే వాసవి కాలేజీలో కంప్యూటర్ ఇంజనీరింగ్ చదివాడని ఒక బంధువు ఒక సంబంధం తెచ్చాడు. అబ్బాయి తల్లిదండ్రులు పెద్దగా చదువుకున్న వాళ్లు కాదని, కాని నంద్యాలలో పెద్ద చెరువు కింద పాతికెకరాల పొలం వుందని, ఒక్కడే కొడుకని ఆ సంబంధానికి ఒప్పుకున్నాడు. పాతిక లక్షలు కట్నం ఇచ్చి, మరో పది లక్షలు ఖర్చుపెట్టి వైభవంగా పెళ్లి చేశాడు. అమ్మాయిని, అల్లుణ్ని అమెరికా పంపాలని అనుకున్నాడు. పెళ్లయిన కొత్తలో ఏవేవో కోర్సులు చేస్తున్నానని చెప్పేవాడు భాస్కర్. ఎపుడో తప్ప ఇంటికి వచ్చేవాడు కాదు. ఏడాదికి దీప్తికి పాప పుట్టింది. అల్లుని సంగతి అంతుబట్టని గోపాల్‌రావు, ఒకరోజు ధైర్యంచేసి వాసవి కాలేజీలో ఎంక్వయిరీ చేయించాడు తన దగ్గరి బంధువైన ఒక జర్నలిస్టుతో.

భాస్కర్ ఇంజనీరింగ్ కోర్సు పూర్తిచేయలేదని, బాక్‌లాగ్స్ మూడో సంవత్సరానివి, ఫైనలియర్‌వి కలిసి 10 సబ్జెక్ట్సు మిగిలిపోయాయని తెలిసింది. అంటే బి.ఇ. రెండేళ్లు మాత్రమే చదివాడు. మరో రెండేళ్లు జులాయిగా తిరిగి తాగుడుకు అలవాటు పడ్డాడు. ఆ తల్లిదండ్రులకు కొడుకు వుద్యోగం చేయకుండా వూళ్లో వున్నా పట్టలేదు. కట్నం పాతిక లక్షలు వచ్చాయి. కోడలివైపు నుంచి పదెకరాల మాగాణి కూడా వస్తుంది. కొడుకు విషయంలో వారికి ఎలాంటి అసంతృప్తి లేదు. సిటీలో వుండడం వల్ల గోపాల్‌రావు కూతురు, అల్లుని మీద చాలా ఆశలు పెట్టుకున్నాడు. అవన్నీ చెల్లాచెదురు కావడంతో, రెండో అమ్మాయి విషయంలోనైనా జాగ్రత్తగా తగిన సంబంధం చూడాలని, తోడల్లున్ని చూసైనా పెద్దల్లుడిలో బాధ్యత పెరుగుతుంది అనుకున్నాడు. ఇందిరకు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం చేస్తున్న కార్తీక్‌తో పెళ్లి జరిపించాడు మరో పాతిక లక్షలు ఇచ్చి.

ఇందిర అమెరికా వెళ్లాక, దీప్తిని, అల్లున్ని దగ్గర వుంచుకొని, అల్లుడిని బాగు చేసుకోవాలని తలపోశాడు గోపాల్‌రావు. తమ ఇంట్లోనే వుండి బి.ఇ. పూర్తి చేసుకోమని అల్లుడికి సలహా ఇచ్చాడు.

భాస్కర్ అందుకు అంగీకరించి, "దీప్తిని, పాపను ఒకసారి మా ఇంటికి తీసుకొని వెళ్లి వస్తాను. వచ్చాక చదువులో పడతాను. నా బి.ఇ. డిగ్రీ చేతికి వచ్చేదాక ఇక ఎక్కడికి వెళ్లను" అన్నాడు.

దీప్తి భర్త వెంట వూరు వెళ్లింది. భాస్కర్ తన తల్లిదండ్రులతో మామగారి ఇచ్చిన సలహా చెప్పాడు.

అది విన్న భాస్కర్ తండ్రి "అమెరికా స్వర్గానికి బెత్తడు దూరంలో వుంటుంది అంటారు. మరి స్వర్గానికి వెళ్లినవారు రారు. ఇందిర ఇక రాదు. నీ మామ తన అన్నదమ్ముల నుంచి ఇంకా ఆస్తి పంపకాలు చేసుకోలేదట కదా, ఆ పంపకాలు పూర్తి చేసి, వచ్చిన పొలం, బ్యాంకు బాలెన్సు నీ పేర చేయించమని చెప్పు. మా అందరి ఎదురుగా వుంటావు. భోగభాగ్యాలు అనుభవిస్తావు. ఈ కాలంలో అన్నదమ్ములను నమ్మితే, రేపొద్దున మీ మామకు ఏమన్నా అయితే, ఆ పొలం వారి సొంతం అవుతుంది".

గోపాల్‌రావు ఆయన సోదరులు చాలా అన్యోన్యంగా వుంటారు. అన్నదమ్ముల మధ్య అపనమ్మకాలు, డబ్బు, ఆస్తులు పోగేసుకోవడం వంటివి గోపాల్‌రావుకు ఇష్టం వుండదు. మంచి అవకాశాలు కల్పించుకోవాలి. కష్టపడి పనిచేయాలి. ఆనందంగా అందరం కలిసి జీవించాలనేది ఆయన తత్వం. సరిగ్గా దీనికి భిన్నమైంది దీప్తి భర్తవైపు కుటుంబం. మామగారి మాటలు విన్న దీప్తికి చిరాకు వేసింది. తన మీద ప్రేమతో కాదు భర్త తనను ఇక్కడికి తెచ్చింది. ఆస్తిపాస్తుల కోసం అని అర్థం చేసుకుంది. ఆమెకు భర్త మీద వున్న కాస్త సదభిప్రాయం కరిగిపోయింది.

"మీరు అడిగినంత కట్నం పెళ్లినాడే ఇచ్చారు. ఇక మా నాన్నను మీరేం అడిగినా నాకే ఇష్టం వుండదు" అని తేల్చి చెప్పింది దీప్తి.

"మీరు ఇద్దరూ కూతుళ్లే. ఇప్పుడు ఒక్కదానివే, అదంతా మా వాడికే చెందాలి. మీ నాన్న ఆస్తిపాస్తులు మందిపాలు కావడమేమిటి? ఆయనకు తరువాత ఏం బుద్ధిపుడుతుందో, ఇప్పుడు మా వాడి సొంతం కావాలి. మీ అమ్మను, నాన్నను ముసలితనంలో సాకాల్సింది మా వాడే కదా? వాళ్లు అల్లుడి దగ్గర వచ్చి వుంటామంటే వద్దనకూడదుకదా! మరి మీ నాన్న తన సంపాదనను, ఆస్తిపాస్తుల్ని అన్నదమ్ములకు ఇచ్చి, వట్టి చేతుల్తో ఇక్కడికి వస్తే ఎట్లా చూసుకోవాలి? ఆస్తిపాస్తులు పంచుకుని వచ్చి, నీకు ఇందిరకు సెరి సగం ఇస్తే, ఇందిర అమెరికాలో ఉండి తల్లిదండ్రులను చూసుకోలేదు కదా. మా వాడే కదా చూసుకోవాల్సింది. పెద్దల్లుడికి ఏమీ ఇవ్వకుండా, మావాడి దగ్గరికి బతకడానికి వస్తే ఎలా దగ్గర వుంచుకోవాలి?" శ్రీధర్ తల్లి అడిగింది.

తన తండ్రిని ఒక నిస్సహాయుడిగా చిత్రిస్తున్న అత్తగారి వాదనలు విన్న దీప్తి "మీరు చాలా దుర్మార్గంగా మాట్లాడుతున్నారు. మా అమ్మ, నాన్న గురించి మీరు మాట్లాడేధోరణి నాకేం బాగులేదు. నాకివ్వాల్సింది ఇచ్చారు. ఆయనకై ఆయన ఏమైనా ఇస్తే తీసుకుంటాను కాని, ఆయన ఆస్తిని, సంపాదనను అడుగను. మా నాన్న నుంచి అంతా తీసుకొని బికారిని చేసి, అల్లుడి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడేట్టు చేయలేను" అంది.

"పెళ్లయిన తరువాత ఆడపిల్లకు భర్త, భర్త ఇల్లే ముఖ్యం. ఇంకా అమ్మా, నాన్న అంటూ మాట్లాడతావేంది? ఇన్ని మాటలు నీ నుంచి వినడానికి కాదు. చెప్పింది చేస్తావా లేదా?" అని అడిగింది అత్తగారు.

"లేదు" అని వెంటనే సమాధానం ఇచ్చింది.

దీప్తి నోటి నుంచి ఆ మాట వచ్చిందో లేదో ఆమె చెంపమీద అత్తగారు ఒకటిచ్చింది. దిమ్మెరపోవడం దీప్తి వంతయింది. కొడుకును కన్న అహంకారంతోనే కదా చదువు రాకపోయినా ఇంజనీరింగు చదివిన తనను అత్త కొట్టగలిగింది? అత్త తనపై చేయి చేసుకోవడం చాలా అవమానంగా భావించి, పాపను తీసుకొని ప్రయాణమయింది దీప్తి.

"ఆపరా దాన్ని. ఎక్కడికి పోతదో నాలుగు అంటించరా" అంటూ ఛర్నాకోలా అందించింది భాస్కర్‌కు అతని తల్లి.

"ఖామోష్. మరొక్క దెబ్బ నా మీద పడితే, మీరంతా జైల్లో వుంటారు. ఖబర్దార్" అంది దీప్తి ఏమాత్రం తొణక్కుండా.

"ఏమిట్రా అది హైదరాబాద్‌లో వుందనా మనల్ని తురకంలో బెదిరిస్తోంది. దాని అంతు చూడు" అంటూ కేకలేసింది.

"అమ్మా కొంచెం ఆగు. మా పెళ్లి రోజున పేపర్లో పెళ్లికి శుభాకాంక్షలు తెలిపే ప్రకటనలు చూసి సంబరపడ్డావు గుర్తుందా? దీప్తిని కొడితే, పేపర్లోకి ఎక్కుతాయి మన పేర్లు. నా బతుకు బండలవుతుంది. నీ కోపం తగ్గించుకో" అని సలహా ఇచ్చాడు భాస్కర్ చాలా శాంతంగా. దీప్తికి జరిగిన అవమానం తెలిసి ఆ తల్లిదండ్రులు చాలా కుమిలిపోయారు.

గోపాల్‌రావు అల్లున్ని దారిలో పెట్టలేకపోయాడు. కాని దీప్తిని మంచి పేరున్న కంప్యూటర్ కంపెనీలో వుద్యోగంలో చేర్పించగలిగాడు. భాస్కర్ దీప్తిని చూడ్డానికి కూడా రావడం లేదు. ఆయన కలలన్నీ కల్లలు కాగా, దీప్తిని చూసుకుంటూ బండిని భారంగా లాగుతున్నాడు.

"నాన్న ఇప్పుడు చెప్పు ఆడపిల్లల్ని కన్నందుకే కదా ఆ తల్లిదండ్రులు బాధలు పడుతున్నారు?"

"ఇందులో గోపాల్‌రావ్ తప్పు వుంది. పెళ్లికి ముందు భాస్కర్ గురించి బాగా తెలుసుకోవాల్సింది. చెప్పుడు మాటలు విని అలాంటి పెళ్లి చేయడం వల్ల, దీప్తికి కష్టాలు వచ్చాయి, వారికి మనశ్శాంతి లేకుండా పోయింది. ఆడపిల్ల పెళ్లి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేగాని ఆడపిల్లలు వద్దు అనుకోకూడదు" అన్నాడు శేఖర్.

"మీ పిన్ని కూతురు జ్యోతిని మరిచిపోయావా నాన్నా?" నీతో కలిసి ఆడిపాడినదే కదా!"


శేఖర్ గతాన్ని గుర్తు చేసుకున్నాడు.

** ** **



# జ్యోతి

**జ్యో**తి అన్న రాజేష్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చదవడానికి అమెరికా వెళ్లి తిరిగిరాని దూరతీరాలకు వెళ్లిపోయాడు. జ్యోతి అమ్మమ్మ తన కూతురిని, అల్లున్ని ఆ దుఃఖం లోంచి బయట పడేయడానికి జ్యోతికి ఎం.ఏ. ఫైనలియర్‌లో వుండగానే పెళ్లి జరిపించింది. జ్యోతి ఒకతే కూతురని, దూరం బంధువైన శ్రీకాంత్ కట్నం అడక్కుండా పెళ్లి చేసుకున్నాడు. చదువు పూర్తయ్యే వరకు జ్యోతి తల్లిదండ్రులతోనే వుంది. ఈలోగా ఆమె గర్భవతి కావడంతో కాన్పువరకు వుండిపోయింది. నిరుద్యోగిగా వున్న శ్రీకాంత్ అపుడపుడు వచ్చిపోయేవాడు. ఆడపిల్ల పుట్టిందని కబురు అందజేస్తే చూడడానికి వచ్చిన శ్రీకాంత్, తను బిజినెస్ చేయాలనుకుంటున్నానని, అందుకోసం పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత డబ్బు లేదంటే అప్పు చేసి ఇవ్వమన్నాడు. లేదా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోమని, ఎప్పటికైనా జ్యోతి తల్లిదండ్రులను తనే సాకాలి కనుక తను వాళ్ల బాగోగులు




చూసుకుంటానని చెప్పాడు. జ్యోతి తండ్రి దీర్ఘాలోచనలో పడ్డాడు. 'అవును ఇంకో ఏడాదేగా సర్వీసు వుండేది, వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంటేనేం' అనుకున్నాడు. కాని జ్యోతి తల్లి సుజాతకు ఇంకా ఎనిమిదేళ్ల సర్వీసు వుంది. అల్లుడి మాటల తీరు ఆమెకు కోపం తెప్పించాయి. "వుద్యోగం సద్యోగం చూసుకోలేనివాడివి, నీకు డబ్బిచ్చి బిజినెస్ పెట్టిస్తే మమ్మల్ని సాకుతావా, నిన్ను నీవు పోషించుకోలేనివాడివి మమ్మల్ని పోషిస్తావా?" అని నిలదీసింది.

"మీకున్నది ఒక్క కూతురే కదా! అడిగినప్పుడు డబ్బిస్తారులే అని, వుద్యోగం చేయకుండా బిజినెస్ చేయొచ్చని ఇన్నాళ్లు ఎదురుచూశాను. జ్యోతికి పుట్టింది ఆడపిల్ల. మీరు పది లక్షలు ఇచ్చేదాకా జ్యోతిని కాపురానికి తీసుకెళ్లను" అని బెదిరించాడు శ్రీకాంత్.

సుజాతకు చాలాకోపం వచ్చింది."జ్యోతిని నీవెంట పంపేదేలేదుఅంది".

జ్యోతి తండ్రి కల్పించుకుని, "పల్లెల్లో ఒక సాంప్రదాయం వుంది. ఒక్క కూతురే వున్న ఇంటికి అల్లుడే ఇల్లరికం వస్తాడు. టౌన్ జీవితం కనుక అడగలేదు. ఎక్కడెక్కడో వుద్యోగాలు చేయాల్సి వుంటుంది. ఒక ఇల్లంటూ వుండదు కదా. కాని నువ్వు బిజినెస్ చేస్తానంటున్నావు. నువ్వు మా దగ్గరే వచ్చి వుండు. ఏ రకం బిజినెస్‌కు నువ్వు సరిపోతావో ముందు మమ్మల్ని తెలుసుకోనివ్వు" అని శ్రీకాంత్‌ను సముదాయించాడు.

"అత్తామామలు చెప్పినట్టు నడుచుకునే మనిషిని కానండీ నేను. ఇంత సేపు నేను వాదించకుండా జ్యోతికి నాలుగు అంటించి వుంటే డబ్బొచ్చి పడేది నా చేతుల్లో"అంటూ, "జ్యోతి రడీ అవు. మా వూరు వెళదాం" అన్నాడు విసురుగా.

"నేను రాను. డబ్బు రాబట్టడానికి నన్ను తీసికెళతానంటున్నావు. నువ్వు వుద్యోగమో, బిజినెసో చేస్తున్నప్పుడు వస్తాను" అంది జ్యోతి.

ఇది గడిచి రెండేళ్లయినా శ్రీకాంత్ తిరిగి ఆ గడపతొక్కలేదు. ఉన్న ఒక్క కూతురికి తగిన భర్త లభించలేదని జ్యోతితండ్రి దిగులుతో రిటైర్డ్ అయిన కొన్నాళ్లకే గుండెపోటుతో చనిపోయాడు. జ్యోతికి కాలేజీలో వుద్యోగం దొరికింది. పాపను చూసుకోవాలని సుజాత వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుంది. ఇంటికొచ్చే పేషంట్లను చూస్తోంది. పదిరోజుల క్రితం అమ్మను చూడడానికి వచ్చింది జ్యోతి అత్త. అత్త అమ్మతో ఏమందో తెలుసా నాన్నా?

"అమ్మా, నాన్న అంటే నాకు చాలా ప్రేమ. అన్నయ్య పోయాడు. వాళ్లను ఒంటరిగా వదిలిపోవాలంటే నాకు దుఃఖం కలిగింది. అమ్మ వాళ్ల నాన్న కమ్యూనిస్టు. ఆడవాళ్ల హక్కులకు ఎక్కడ భంగం కలుగుతున్నా సహించలేదు అమ్మ. అలాంటి అమ్మ ముందు ఆరోజు శ్రీకాంత్ చాలా చెత్తగా మాట్లాడాడు. ఆమెకు కోపం వస్తే ఇంకేమైనా వుందా? ఆరోజు నాకు చాలా భయమేసింది. అయినా ఆరోజు అమ్మ చాలా కంట్రోల్‌లో వుందనే చెప్పాలి. నన్ను అడ్డుపెట్టలేదు. పోవడం, మానడం నా ఇష్టానికే వదిలింది. అంత ఆవేశపడే అమ్మలో నిస్సహాయతను చూశాను. అది భరించలేకే నేను శ్రీకాంత్ వెంట వెళ్లలేదు. రోజు రోజుకు ఏదో తెలియని బలహీనత మనసులో కొంచెం కొంచెం ఇంకుతోంది.

శ్రీకాంత్ పిలిచినప్పుడు వెళ్లాల్సిందేమో,నేను తప్పు చేశానేమో. జీవితం ఆగిపోయినట్టు అనిపిస్తోంది. నాకాపురం బాగుంటే నాన్న ఇంకొన్నేళ్లు బతికేవాడు. నేనే నాన్నను చంపానని చెబుతూ వెక్కివెక్కి ఏడ్చింది జ్యోతత్త".

"జ్యోతి తను తప్పు చేశానని ఎందుకనుకోవాలి. ధైర్యం లేదు. పిరికిపిల్ల. శ్రీకాంత్ కోసం ఇంకా ఎదురుచూడడమే మిటి?జ్యోతి అమాయకత్వం చూసి వాడట్లా ప్రవర్తిస్తున్నాడు".

"పైకి చాలా ధైర్యంగా వుండేవాళ్లు కూడా భర్త, కుటుంబం అనేసరికి మెత్తబడిపోతారు. నాన్నా, నేను కడుపులో పడ్డప్పటి నుంచి అమ్మను చూస్తోంది డాక్టర్ అరుణ. ఆమె చాలా ధైర్యస్తురాలు కదూ! ఆమె గురించి నీకు తెలుసా నాన్నా?"

"ఆమెకు బాధలా? నేను నమ్మను. ఎంత చలాకీగా, ఫ్రీగా వుంటుంది. ఎన్ని విషయాలు మాట్లాడుతుంది. ఆడపిల్లలంటే అలా వుండాలి. అలాంటి డాక్టర్ అరుణకు సమస్యలా?"

"అవును నాన్నా, అరుణక్కూడా ఇలాంటి సమస్యలే".

** ** **

డాక్టర్ జగన్నాథం కూతురు అరుణ. డాక్టర్ల వద్దకు ప్రజలు రావడం కాదు ప్రజల వద్దకు డాక్టర్లు వెళ్లాలంటాడు. డాక్టర్ కోట్నీస్ అంటే అభిమా నం. చైనాలో ఒక బిడ్డనే కంటారు. భారతీయులం కూడా ఈ పద్ధతి అనుసరించాలని, అరుణ పుట్టగానే, భార్యకు కూడా చెప్పకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్నాడు. అరుణ తన క్లాస్‌మేట్‌నే ప్రేమించి పెళ్లి చేసుకుంటే, తల్లిదండ్రులు అడ్డు చెప్పకపోగా, వరున్ని వెదికే భారం తగ్గించినందుకు సంతోషపడ్డాడు ఆ తండ్రి. ఆ సంతోషం వాళ్లకు అట్టే కాలం నిలవలేదు. అరుణ, ఆమె భర్త వినోద్ ఇద్దరూ అపోలో హాస్పిటల్‌లో డాక్టర్లుగా చేరారు. జీతాలు బాగానే వున్నాయి. ఆపరేషన్ చేసినప్పుడు అదనంగా డబ్బుకూడా వచ్చేది. అయినా, సొంత హాస్పిటల్ లేకపోయిందని చింత వారిని ఎప్పుడూ వేధించేది.

అరుణ తండ్రి గురించి చెబుతుంటే, 'కూతురికి అల్లుడికి ఒక హాస్పిటల్ నిర్మించి ఇవ్వడా, ఆయనకున్న పేరు ప్రఖ్యాతుల వల్ల పేషెంట్లు తమ హాస్పిటల్‌కు క్యూ కట్టక పోరు' అనుకున్నాడు డాక్టర్ వినోద్. పెళ్లి తరువాత తెలుసుకున్నాడు అరుణ తండ్రి ఏమీ సంపాదించలేదని. పేదలకు వైద్యం తోపాటు మందులు ఇవ్వడం, మందులు లేకపోతే డబ్బులిచ్చి పంపడం వినోద్‌కు నచ్చేది



# అరుణ

కాదు. రోజురోజుకు వినోద్ అసహనం భరించలేక ఒకవైపు, కాలంతో మారని తండ్రిని చూసి చిరాకు పడుతూ అరుణ ఒకరోజు భర్తతో కలిసి వేరే ఇంట్లో కాపురం పెట్టింది. అరుణ అలా వెళ్లి పోవడంతో ఆమె తల్లి చాలా ఆవేదన చెందిం ది. ఆ దిగులుతోనే ఆ తల్లి చనిపోయింది. తరువాత, అరుణ తండ్రిని అడిగింది, "మాతో కలిసివుండు నాన్న, నువ్వేమి చేయక్కర్లేదు. నీకిష్ట మైన బుక్స్ చదువుకుంటూ వుండు".

"వైద్యం చేయకుండా వూరికే వుండు అంటావు, అవునా?" అన్నాడు జగన్నాథం కూతురి కళ్లల్లోకి చూస్తూ.

"అవును నాన్న. నిన్ను చూసుకుంటాం, కాని నువ్వు ప్రజాసేవ పేరిట డబ్బు ఖర్చు చేయొద్దు. నీకెంత డబ్బు కావాలన్నా ఇస్తాం" అంది అరుణ తల దించుకొని.

"డబ్బేం చేసుకోను? నేనో నర్సింగ్‌హోం నడపలేకపోయానని నామీద మీ కంప్లైంట్స్ వుండనే వున్నాయి. మీరనుకున్నట్లు నేను పాతకాలం మనిషినే. నన్ను ప్రజలే చూసుకుంటారు. నాకేం భయంలేదు. చేతులూ కాళ్లు ఆడని సమయంలో ఎలా అని భయపడుతూ బతకడం కన్నా ఘోరమైన నరకం మరోకటిలేదు. నన్ను మొండివాడని ఈసడించుకున్నా ఫర్వాలేదు. నాకిష్టమున్నట్లు బతికే స్వేచ్ఛ నాకుంటేచాలు. నీకెప్పుడూ ఆంక్షలు పెట్టలేదు. స్వేచ్ఛనిచ్చాను. నువ్వు కూడా నన్ను అలాగే చూడు" అన్నాడు కూతురితో.

(మిగతా 38వ పేజీలో)

# అమ్మా నాన్నా, నన్ను చంపేయండి

(22వ పేజీ తరువాయి)

మామగారి భారం మీద పడనందుకు వినోద్ సంతోషించాడు. అరుణ కూడా మారని తండ్రి మనస్తత్వానికి విసుగువడిందే కాని ఆయన ఆదర్శాలను అలవోకగా మర్చిపోయింది. మరిచిపోలేకపోతే తను వినోద్‌తో కలిసి శాంతిగా బతకలేననుకుంది. ఒకరోజు వుదయాన్నే తండ్రి చనిపోయినట్లు కబురంది పరుగుపరు గున ఇంటికి వెళ్లింది అరుణ. అప్పటికే ఇంటిముందు వందలాదిమంది. రాత్రి నిద్రలో స్ట్రోక్ వచ్చి చనిపోయాడని అనుకుంటున్నారు తండ్రికి తెలిసిన డాక్టర్లు. "అది పుత్రి స్ట్రోక్ కాదని, డాటర్ స్ట్రోక్" అని అపరాధ భావనతో అనుకుంది అరుణ. వందలాదిమంది వూరేగింపుతో ఆయన శవయాత్ర జరిగింది. ఆయన వీలునామాలో తన డెడ్‌బాడీని హాస్పిటల్‌కు డొనేట్ చేయాలని, ఇల్లు లైబ్రరీకి వువయోగపడాలని రాశాడని, ఆయన కొలీగ్స్ ఆ వీలునామా అరుణకు చూపించారు. వీలునామా చూసి, బావురుమంది అరుణ.

రక్తంపంచుకుపుట్టినా, తండ్రి ఎన్నెన్నో విషయాలుచెబుతూ పెంచినా, తను మార్కెట్ వలలో చిక్కు కున్నానని, కన్నతండ్రికి పరాయిదైపోయానని తండ్రికి ఆయన చివరి రోజుల్లో తోడుగా వుండలేకపోయానని అపరాధభావన ఆమెను వేధిస్తోంది. కాని వారి గురించి తెలిసినవారందరూ అరుణ పిచ్చిదని, అరుణకు ఆడపిల్లగా ప్రవర్తించడం రాదని, శ్రీధర్ తెలియక అరుణను పెళ్లి చేసుకున్నాడని. పాపం అని అతనికే సానుభూతి తెలుపుతూ వుంటారు.

"ఇప్పుడు చెప్పు నాన్నా! ఆడపిల్లల్ని కన్న తండ్రులు కూడా పితృస్వామ్యం బాధితులే కదా నాన్నా!"

** ** **

"అమ్మా, నువ్వు మంచివాళ్లు. నా వల్ల మీరు బాధలు పడడం నాకు ఇష్టంలేదు నాన్నా. నన్ను చంపండి నాన్నా"?

శేఖర్ దగ్గర సమాధానాలు లేవు. శేఖర్ రెండు చేతులు ముఖం మీద కప్పుకొని వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు.

శ్రీవిద్యకు మెలకువ వచ్చింది. శేఖర్‌ను చూసి గాభరా పడింది. "ఏమైంది? ఎందుకు ఏడుస్తున్నావ్" అని అడిగింది. తన ముఖం మీది చేతులు తీసివేసి, కళ్లు తుడుచుకుంటూ "ఏమీ లేదులే" అన్నాడు.

"ఏంలేకపోవడమేమిటీ? అలా ఏడుస్తూ. ఏమైనా పీడకల వచ్చిందా?"

"అవును పీడకలలాంటిదే. పడుకో ఏం లేదులే".

శేఖర్ పడకమీది నుంచి లేచి మంచినీళ్లు తాగి వచ్చాడు.

"ఏం కల వచ్చింది? ఆడపిల్లకన్నా అన్యాయంగా ఏడ్చేశావు. పీడకలలకు ఏడ్చే నిన్ను చూస్తుంటే, నీదెంత మంచి మనసో తెలియదనుకున్నావా? చెప్పు ఏం కల వచ్చిందో" లాలనగా అడిగింది శ్రీవిద్య.

"చెబితే నమ్మవు నువ్వు.కాని నిజం. కలరాలేదు. మేల్కొనే వున్నాను. చాలా సేపట్నుంచి మన పాప ప్రీతితో మాట్లాడుతూ ఉన్నాను".

"పాపతో మాట్లాడావా? నమ్మలేని ఊహలు చేశావే!"

"ముందేచెప్పాను నువ్వు నమ్మవని. కానినిజం.మన పాపమీద ఒట్టు".

"అయితే ఏమంది మన పాప. నేను చెప్పను.నా నోటితో నేను చెప్పలేను. మన పాప ఏం కోరుతున్నదో?" అంటూ మళ్లీ ఏడ్వడం మొదలు పెట్టాడు శేఖర్. శ్రీవిద్య పూర్తి మెలకువలోకి వచ్చింది.

విషయం చెప్పకుండా నువ్వలా ఏడుస్తుంటే చాలా బాధగా వుంది. నాకు చెప్పకూడదా? నువ్వు, నేను పరాయివాళ్లమా? పాప మాట్లాడిందంటావు. ఏమిటో చెప్పమంటే ఏడుస్తావు. నాక్కూడా ఏడుపొస్తోంది అంటూ కన్నీళ్లు పెట్టుకుంది.

"నువ్వు బాధ పడకూడదు విద్యా. కాని విని తట్టుకోలేవని చెప్పలేకపోతున్నాను. కాని చెప్పక తప్పదనిపిస్తోంది. ధైర్యంగావుండాలి నువ్వు".

"అలాగే" అంది. ప్రీతి చెప్పిన విషయాలు చెప్పాడు.

శ్రీవిద్య తన పొట్టవైపు ఆప్యాయంగా చూసుకుంది. "మనకు ప్రీతి ఉంటుంది. ఇది పీడకల అని మరిచిపో. దగ్గరగా పడుకో", అంటూ శేఖర్‌ను పక్కన పడుకోబెట్టుకొని,అతని తలను తన గుండెలోకి పొదుపుకుంది. అతని తలలోకి వేళ్లు పోనిచ్చి, సుతారంగా దువ్వుతూ "మనలోని భయాలే మన పాపతో మాట్లాడించాయి. వద్దు భయపడవద్దు మనం" అంటూ ఓదార్చింది. ఆమె మాటలు విని శేఖర్ నిద్రలోకి జారుకున్నాడు. కాని శ్రీవిద్య ఆలోచనలతో మేల్కొంది.

■




## కుటుంబంతో సరదాగా



నేను చిన్న వ్యాపారస్తుడ్ని. వ్యాపార నిమిత్తం వారమంతా చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతాను. మధ్యలో ఒకటి రెండు రోజులు ఖాళీ దొరికినా బిజినెస్‌కి సంబంధించిన వస్తువులను టౌనుకు వెళ్ళి తెచ్చుకోవడానికి సరిపోతుంది. ఒక్కరోజు కూడా ఖాళీగా ఉండను. కానీ ఆదివారం మాత్రం వ్యాపార పనులన్నీ పక్కనపెట్టి భార్యాబిడ్డలతో ఆనందంగా గడపడానికి కేటాయిస్తాను. ఆదివారం మా గ్రామానికి దగ్గరలో వున్న పట్టణానికి షాపింగ్‌కు వెళ్ళి పిల్లలకు కావలసినవి కొనుక్కొని కుటుంబంతో సహా రెస్టారెంట్‌లో భోజనంచేసి, మంచి సినిమా ఉంటే చూసి సాయంకాలానికి ఇంటికి వస్తాం. వారమంతా పడ్డ శ్రమపోయి ఆ రోజు మనసుకు హాయిగా అనిపిస్తుంది.ఆ సంతోషం హృదయమంతానిండి ఎంతో తృప్తిపొందుతాను.

– వై. చిట్టిబాబు,

బలభద్రపురం, తూర్పుగోదావరి జిల్లా

## నాకు నచ్చిన రోజు




ప్రతి ఆదివారం నాకు పండగ రోజులా ఉంటుంది. అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు అందరం ఈ ఊరిలోనే ఉన్నాం. ఆదివారం వచ్చిందంటే అందరం ఎవరో ఒకరి ఇంట్లో కలుస్తాం. లలితా సహస్రం, విష్ణుసహస్రం పారాయణ చేస్తాం. స్పెషల్ ఐటమ్స్‌తో భోజనం చేస్తాం. టివిలో లైవ్ ప్రోగ్రామ్స్ చూడటమంటే మాకిష్టం.అందరితో కలిసి మెలిసి ఉండటం, అవసరమయినపుడు ఆదుకోవడం నేను చేసేపని. అతిథులకు వండి, వడ్డించడమంటే చాలా సంతోషంగా ఉంటుంది. ఇంటికి పెద్దకోడలిగా బాధ్యతలను స్వీకరించడమన్నా చాలా ఇష్టం.

– కస్తూరి లక్ష్మీనరసమాంబ,

హైదరాబాద్

## నూతనోత్తేజాన్నిచ్చే వారం



వారంలో ఆరు రోజులు వ్యాపార అభివృద్ధి లక్ష్యంగా సాగుతున్న ఈయాంత్రికమైన జీవితంలో ఒక్క ఆదివారమే మాకు కాస్తంత ఏకాంతం. స్నేహితులతో, బంధువులతో మాట్లాడటానికి, సరదాగా గడపడానికి ఆదివారమే అవకాశం వుంటుంది. వ్యక్తిగత అభిరుచులైన సంగీతం వినడం, మంచి పుస్తకాలు చదవడం, షికారుకు వెళ్ళటం, వ్యక్తిత్వ వికాసాన్ని సంపాదించుకోవడానికి ఒక సువర్ణావకాశాన్ని ఆదివారం కల్పిస్తుంది. వారంరోజుల శ్రమను పోగొట్టుకొని నూతనోత్సాహాన్ని నింపుకోవడానికి ఆదివారం ఎంతో సహకరిస్తుంది.

– బి.మధుసూదనరెడ్డి,

బేతంచెర్ల, కర్నూలు జిల్లా